## 25 నుండి తమ్మడేపల్లిలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు


వాల్మీకి సంఘం నాయకులు అనిల్‌కుమార్

అమరాపురం, అక్టోబర్ 23 ప్రభాతవార్త
మండలంలోని తమ్మడేపల్లి గ్రామంలో ఈ నెల 25 నుండి 27వతేదీ వరకు మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు వాల్మీకి సంఘం నాయకులు తమ్మడేపల్లి అనిల్‌కుమార్ తెలిపారు. 25న గంగపూజ, వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన, 26న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, 27న మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా భారీ శోభాయాత్ర గ్రామంలోని వీధుల్లో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల ముఖ్యనాయకులు, స్థానిక నాయకులు హాజరవుతారన్నారు. వాల్మీకి కులబాంధవులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## నేడు ఎమ్మెల్యే, మాజీ ఎంఎల్‌సి పర్యటన


మండల కన్వీనర్ గణేష్

అమరాపురం, అక్టోబర్ 23 ప్రభాతవార్త
అమరాపురం మండలంలో గురువారం జరిగే పల్లె పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎంఎల్‌సి గుండుమల తిప్పేస్వామి పాల్గొననున్నట్లు మండల కన్వీనర్ గణేష్ తెలిపారు. ఇందులో భాగంగా వారు మండలంలోని చిక్కుడుకు, హాలుకూరు. వీరాపురం, వలస, అగ్రహారం గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తారని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## హాలుకూరులో ఆధార్ ప్రత్యేక క్యాంపు

అమరాపురం, అక్టోబర్ 23 ప్రభాతవార్త


ఆధార్ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని హాలుకూరు గ్రామ సచివాలయంలో బుధవారం ఆధార్ ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఇందులో వలస సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ షెక్షావలి ప్రత్యేక అధికారిగా పాల్గొని ప్రజలకు ఆధార్ సేవలను అందించారు. ప్రత్యేక క్యాంపులో చిన్నారులకు ఆధార్ నమోదుతో పాటు పేర్లు, చిరునామా మార్పు ఆధార్ అప్‌డేట్ తదితర సేవలను ప్రజలకు కల్పించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకున్నారు.

## రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను త్వరగా అమలు చేయండి

-మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడును కోరిన ఎంఆర్‌పీఎస్


రాష్ట్ర ఆర్థిక, నీటి పారుదలశాఖ మంత్రులకు కలిసి విన్నవిస్తున్న ఎంఆర్‌పీఎస్ ముఖ్య నాయకులు

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త
దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలో వర్గీకరణను త్వరగా అమలు చేయాలని ఎంఆర్‌పీఎస్ అగ్రనాయకులు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును విన్నవించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు ఆర్.జె.ప్రకాష్ ఆధ్వర్యంలో మంత్రులను కలిసిన ముఖ్య నాయకులు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో దళితుల మీద జరుగుతున్న దాడులు, మహిళల మీద జరుగుతున్న అత్యాచారాలు మంత్రుల దృష్టికి తీసుకెళ్లి బాధ్యులను కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రాజు, రాయలసీమ జిల్లాల అధ్యక్షులు చిప్పగిరి లక్ష్మీనారాయణ, నాయకులు గంధం శీను, చిప్పగిరి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయండి

- రూరల్ సీఐ చిన్నగౌస్‌ను కలిసిన ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త


రూరల్ సీఐ చిన్నగౌస్‌ను సన్మానిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి దళితులపై దాడి చేసిన వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్‌కు ఎంఆర్‌పీఎస్ నాయకులు విన్నవించారు. బుధవారం పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ డివిజినల్ సభ్యులు కౌకుంట్ల రవి ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు సీఐను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాకప్పి పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెలిగొండ ఓబన్న, డివిజినల్ అధ్యక్షులు రాయంపల్లి వెంకటేష్, ఉరవకొండ తాలుకా అధ్యక్షులు రాంపురం చెన్నప్ప, ప్రధాన కార్యదర్శి కౌకుంట్ల సురేష్, నాయకులు కడమలకుంట రామాంజి, బూదగవి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు విడుదల చేయండి

- తహశీల్దార్ కార్యాలయం ముందు ఏఐఎస్‌ఎఫ్ ధర్నా

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త
డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులకు పెండింగ్‌లోవున్న ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ బుధవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించింది. డిగ్రీ విద్యార్థులతో కలిసి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం చేరుకొని ప్రధాన ద్వారం ముందు బైటాయించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చందు, నియోజకవర్గ అధ్యక్షులు హారున్ రషీద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తానని చెప్పి విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ 2,100 కోట్లు, వసతి దీవెన 1,400 కోట్లు బకాయి పెట్టిందన్నారు. సదరు డబ్బులు విద్యాసంస్థలకు అందకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికేట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. నవంబర్‌లో డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు పరీక్షలు జరుగనున్నాయని ఫీజు రీయంబర్స్‌మెంట్ డబ్బులతో సంబంధం లేకుండా ప్రతిఒక్క విద్యార్థిని పరీక్షలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిప్యూటీ తహశీల్దార్ భోగన గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోశాధికారి రాజు, ఉపాధ్యక్షులు లెనిన్, ప్రభుత్వం డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.


డిప్యూటీ తహశీల్దార్ భోగనగౌడ్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

## గొర్రెలు, మేకల్లో మాంసం వృద్ధికి డీవార్మింగ్ ఎంతో దోహదపడుతుంది

- పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త


గొర్రెలకు డీవార్మింగ్ టీకా వేస్తున్న పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ వెంకటేష్, ఏడీ డాక్టర్ పెద్దన్న, పశువైద్యురాలు డాక్టర్ శ్రీదివ్య

గొర్రెలు, మేకలకు డీవార్మింగ్ వాక్సిన్ వేయించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరిగి మాంసం వృద్ధి చెందుతుందని పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ అన్నారు. ఉరవకొండ పట్టణంతో పాటు మండల పరిధిలోని పెద్దముష్టూరు గ్రామంలో జరుగుతున్న ఉచిత డీవార్మింగ్ క్యాంపును ఆయన బుధవారం పశు వైద్యశాల ఏడీ పెద్దన్నతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గొర్రెలు, మేకలకు వాక్సిన్ వేసి మాట్లాడుతూ వాక్సినేషన్ కార్యక్రమం ఈనెలాఖరు వరకు జరుగుతుందని గొర్రెలు, మేకలు కల్గిన రైతులు ప్రతిఒక్కరూ వాటికి తప్పకుండా వాక్సిన్ వేయించాలని సూచించారు. ఈ కార్య క్రమంలో పశు వైద్యురాలు డాక్టర్ శ్రీదివ్య సిబ్బంది పాల్గొన్నారు.

## వేరుశెనగ పంటకోత ప్రయోగం

- దిగుబడిని అంచనా వేసిన ఏఎస్‌వో, ఏఓ

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త


లత్తవరంలో వేరుశెనగ పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని లత్తవరం గ్రామంలో బుధవారం వేరుశెనగ పంటకోత ప్రయోగం నిర్వహించారు. తనిఖీ అధికారి, మండల వ్యవసాయాధికారి శుభకర్, ఏఎస్ఓ హైమావతి ల ఆధ్వర్యంలో గ్రామంలోని సర్వే నంబర్ 133ఎ1ఎ4బిలోని రైతు నాగరాజు 1.74 ఎకరాల్లో సాగుచేసిన వేరుశెనగ పంట పొలంలో 5 ఇన్టు 5 మీటర్ల విస్తీర్ణంలోని పంటను తొలగించి కాయలను వేరుచేయగా 1,350 గ్రాములు దిగుబడి వచ్చింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ లక్ష్మి, రైతు సేవా కేంద్రం సిబ్బంది గోపాల్ నాయక్, చిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం పార్టీ ఉరవకొండ నూతన కమిటీల ఎన్నిక

- ప్రాంతీయ కమిటీ కార్యదర్శిగా ఎ.రంగారెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్‌గా ఎన్.మధుసూదన్

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త



ప్రాంతీయ కమిటీ కార్యదర్శి ఎ.రంగారెడ్డి, ఉరవకొండ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ ఎన్.మధుసూదన్

సీపీఎం పార్టీ ఉరవకొండ నూతన కమిటీలను ఎన్నుకోవడం జరిగిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఉరవకొండ ప్రాంతీయ కమిటీ (ఉరవకొండ, బెలుగుప్ప, విడపనకల్లు మండలాలు) కార్యదర్శిగా ఎ.రంగా రెడ్డి, ఉరవకొండ అర్గనైజింగ్ కమిటీ కార్యదర్శిగా ఎన్.మధుసూదన్‌ను ఎన్నుకోవడం జరిగిందన్నారు. కమిటీ సభ్యులుగా మురళి, రవికుమార్, రామాంజినేయులు నాయక్, శ్రీనివాసులు, సిద్దప్ప, వీరాంజినేయులు కొనసాగుతారన్నారు. ఈ సందర్భంగా కమిటీల నూతన బాధ్యులు మాట్లాడుతూ తమకు అప్పగించిన బాధ్యతలను పార్టీలోని సభ్యులందరినీ కలుపుకొని ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. వి.రాంభూపాల్ మాట్లాడుతూ మాట్లాడుతూ హంద్రీనీవా నుండి రోజూ 4,000 క్యూసెక్కుల నీరు తీసుకునేలా కాలువ వెడల్పుకు బడ్జెట్లో నిధులు కేటాయించాలని, హెచ్‌ఎల్‌సీ ఆధునీకరణ చేపట్టాలని, ఉంతకల్లువద్ద రిజర్వాయర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నవంబర్‌లో రెండు లక్షల మంది రైతుల సంతకాల సేకరణ చేపడుతామన్నారు.

## ప్రభుత్వాసుపత్రికి 10 ఛైర్స్, 5 సోలార్ స్ట్రీట్ లైట్స్ వితరణ

- వైద్యులకు అప్పగించిన రెన్యూ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త


ప్రభుత్వాసుపత్రి వైద్యులకు ఛైర్స్, సోలార్ స్ట్రీట్ లైట్స్ అందిస్తున్న రెన్యూ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు

పట్టణంలోని 50 పడకల ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి రెన్యూ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ 10 ఛైర్స్, 5 సోలార్ స్ట్రీట్ లైట్లను అందించింది. పట్టణంలోని స్థానిక ఆసుపత్రిలో జరిగిన కార్యాలయంలో కంపెనీ ప్రతినిధులు ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఎల్లోజీ, డిప్యూటీ సివిల్ సర్జన్ వెంకటస్వామి చౌదరికు వాటిని అప్పగించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం వాటిని అందించడం జరిగిందని సదరు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెన్యూ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు అనీల్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్, పలాస్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు

- పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో శుభకర్


ఉరవకొండ రైతు సేవా కేంద్రంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పశువైద్యురాలు డాక్టర్ శ్రీదివ్య

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త
పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి శుభకర్ సూచించారు పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది అవగాహన కార్యక్రమాన్ని పశువైద్యురాలు శ్రీదివ్యతో కలిసి నిర్వహించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఏవో శుభకర్ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ప్రస్తుతం కంది పంటలో శెనగపచ్చ పురుగు నివారణకు ఉద్ధృతిని బట్టి 1 నుంచి 2 గ్రాములు ఇమాక్టిన్ బెంజోయేట్ మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అధిక పూత, పిందెలకు గ్రోత్ ప్రమోటర్స్ వాడాలని, పొటాషియం నైట్రేట్ 1 నుంచి 1.5 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకవాలన్నారు. దీనివల్ల చెట్లు సమాంతరంగా పెరిగి అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. మొక్కజొన్నలో కంకి, గింజ ఎదుగుదలకు 2 గ్రాములు బోరాన్‌ను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున తేమ అధికంగా ఉదని అదనంగా పప్పుశెనగ విత్తనాలను తెప్పించాలని రైతులు కోరగా విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. పశు వైద్యురాలు డాక్టర్ శ్రీదివ్య మాట్లాడుతూ గోకులం షెడ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఎకరం పొలంలో మేత గడ్డిని రెండు సంవత్సరాలు పెంచుకుటే ప్రభుత్వం 90వేల రూపాయలు అందిస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు బీమా, వ్యాధుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించిన రూరల్ పోలీసులు

ధర్మవరం రూరల్, అక్టోబర్ 23 ప్రభాతవార్త


ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మండలపరిధిలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అమరవీరుల వారోత్సవాల సందర్భంగా మూడవరోజు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని పోతుకుంట హై స్కూల్‌లో నిర్వహించినట్లు రూరల్ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా హై స్కూల్ విద్యార్థులను స్టేషన్‌లో పోలీసుల యొక్క బాధ్యతలు, విధులు, వివిధ రికార్డులను వాటి తీరును, వివిధ చట్టాల గూర్చి తెలియజేశారు. స్టేషన్‌లో ఉన్నటువంటి గదులను, కంప్యూటర్ సెక్షన్లను, పోలీసులు చేసే విధులను విద్యార్థులకు వివరించారు. పోలీస్‌స్టేషన్‌లో గల విహెచ్‌ఎస్‌ఎఫ్ సెట్ ఉపయోగించు విధానం, శాంతి భద్రతలను అదుపులో పోలీసుల పాత్ర పలు విషయాలను వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ బందోబస్తు నడుమ సర్వసభ్య సమావేశం

చిలమత్తూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త


మండలమీట్ నిర్వహిస్తున్న దృశ్యం

భారీ బందోబస్తు నడుమ బుధవారం చిలమత్తూరు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం సహకరించి మండల అభివృద్ధి కి కృషి చేయాలన్నారు. సమావేశానికి 8 మంది సభ్యులు హాజరయ్యారు. అనంతరం మండలంలోనెలకొన్న సమస్యలపైసర్పంచులు, మాట్లాడారు. అంతటితో సమావేశం ముగించారు. దీంతో సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకుంటారు అన్న ఉత్కంటకు తెరపడింది. చిలమత్తూరు. లేపాక్షి, పరిగి, హిందూపురంకు సంబంధించి డిఎస్‌పి, సిఐ, ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ యూనస్‌బాబు, ఎంపిడిఓ రమణమూర్తి, మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్డు ఏర్పాటు కోసం వినతి

చిలమత్తూరు. అక్టోబర్ 23 ప్రభాతవార్త


వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

కొడికొండ చెక్‌పోస్టులోని సమర్థనం ట్రస్ట్‌కు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ సంస్థలో పని చేసే సిబ్బంది ఎంపిడిఓ రమణమూర్తికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎంతో మంది దివ్యాంగులకు విద్యతో పాటు ఉపాధిని కల్పిస్తున్న సంస్థకు రోడ్డు లేక అనేక మంది దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే స్పందించి సంస్థకు కొడికొండ చెక్‌పోస్టు నుండి సమర్థనం ట్రస్ట్ వరకు రోడ్డు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సిబ్బంది శంకర్ పాల్గొన్నారు.

## వేరుశనగ పంటకు నష్టపరిహారం చెల్లించాలి - సిపిఎం

చిలమత్తూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త


వినతిపత్రం అందచేస్తున్న సిపిఎం నాయకులు

వర్షాల కారణంగా దెబ్బతిన్న వేరుశనగ, మొక్కజొన్న పంటలకు పంట నష్టపరిహారం అందచేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో వ్యవసాయాధికారి వంశీకృష్ణకు రైతులు వినతి పత్రం అందచేశారు. ఈ మేరకు సిపిఎం నాయకులు ప్రవీణ్, రామచంద్ర మాట్లాడుతూ ఇటీవలకురిసిన అధికవర్షాల వల్ల పంట చేతికొచ్చే సమయంలో పూర్తిగా దెబ్బతినిందన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఫిరంగి ప్రవీన్‌కుమార్, రామచంద్ర, యుఎల్ నరసింహ, మంజు, గోపాలప్ప, గంగరాజు, నరసింహ, రామాంజి, పాల్గొన్నారు.

## అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం

-ఎస్‌పి వి.రత్న

-అమరవీరుడుచంద్రశేఖర్ కుటుంబానికి పరామర్శ


అమర వీరుడుచంద్రశేఖర్ తల్లిని పరామర్శిస్తున్నజిల్లా ఎస్‌పి వి.రత్న ఇతర పోలీస్ అధికారులు

పుట్టపర్తి, అక్టోబర్ 23, ప్రభాతవార్త
విధి నిర్వహణలో అమరు లైన పోలీసుల కుటుంబాలకు అండగా నిలుస్తామని శ్రీసత్య సాయిజిల్లా ఎస్‌పి వి.రత్న పేర్కొన్నారు. బుధవారం పోలీసు అమరవీరుల వారోత్స వాలలో భాగంగా పుట్టపర్తి పరిధిలోని బీడుపల్లి గ్రామానికి చెందిన పోలీస్ అమరవీరుడు చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను ఎస్‌పి పరామర్శిం చారు. చంద్రశేఖర్ తల్లి నారాయణమ్మ,కుటుంబ సభ్యులను పరామర్శించి వారియోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 1993 ఆగస్టు 15న విధుల్లోకి చేరిన చంద్ర శేఖర్ 2003లో రామగిరి పోలీస్ స్టేషన్ నందు విధి నిర్వహణలో ఉండగా నక్సలైట్ల కాల్పుల్లో మృతి చెందారు. పోలీసు అమర వీరుల త్యాగాలను మరువలేమని ఎస్‌పి తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన చంద్రశేఖర్ కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, ఏ పని ఉన్న తనను నేరుగా కలువ వచ్చని ఎస్‌పి వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి పరామర్శించిన వారిలో డిఎస్‌పి విజయ్‌కుమార్, సిఐ సునీత, సిబ్బంది ఉన్నారు.

## బిఎ విద్యార్థులు కెవికెలో క్షేత్ర పర్యటన

కళ్యాణదుర్గం టౌన్, అక్టోబర్ 23 ప్రభాతవార్త


క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్తున్న విద్యార్థులు

ఎస్ విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కళ్యాణదుర్గం బిఎ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం పట్టణ శివారులో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె)కు క్షేత్ర పర్యటన వెళ్లారు. ఒకరోజు పర్యటనలో భాగంగా అక్కడి శాస్త్రవేత్తలు వివిధ రకాల పంటలు, ఉద్యానవనం, పండ్ల మొక్కలు, ఆహార ధాన్యాలు, తృణధాన్యాలు, పశు సంపద, కోళ్ల పెంపకం సస్యరక్షణ, సేద్యంలో మెలుకువలు, సేంద్రీయ ఎరువుల వాడకం మొదలగు అంశాలపై సంబంధిత శాస్త్ర వేత్తలు విద్యార్థులకు వివరించారు. చివరిగా కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్ర వేత్తల ఆధ్వర్యంలో స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈకార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎంవి.శేషయ్య, డాక్టర్‌కె.శ్రీధర్, శాంప్రసాద్, శాస్త్రవేత్తలు డా.ఎం.మల్లికార్జున, శాస్త్ర వేత్త (సేద్య విభాగం), డా.ఈ.శిరీష శాస్త్ర వేత్త( సస్యరక్షణ విభాగం), డా.వి.యుగంధర్ శాస్త్ర వేత్త (ఉద్యాన విభాగం), డా.ఎం.హరని శాస్త్ర వేత్త (పశువిభాగం), విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## తుంగభద్రకు పోటెత్తిన వరద...

- 1 లక్ష క్యూసెక్కుల నీరు నదిలోకి....


తుంగభద్ర డ్యాం గేట్లు తెరిచి వరదనీరు నదిలోకి విడుదల చేసినప్పటి దృశ్యం

బళ్లారి, అక్టోబర్23, ప్రభాతవార్త;
తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తింది. దీంతో 1 లక్ష క్యూసెక్కుల నీరు డ్యాం క్రస్టు గేట్లు తెరిచి నదిలోకి వదిలారు. గత నాలుగైదు రోజులుగా ఎగువన కురిసిన వర్షాలకు భారీగా వరదనీరు తుంగభద్ర డ్యాంకు వచ్చి చేరుతున్నది. ఇప్పటికే రెండుసార్లు భర్తీ కాగా, లక్షలాది క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేయడం జరిగింది. తాజాగా మరోసారి టీబీ డ్యాం పూర్తిస్థాయిలో భర్తీ అయ్యి 1,09,314 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రాగా, అంతేస్థాయిలో దిగువకు వదిలారు. డ్యాం గరిష్ట నీటిమట్టం 1633 అడుగులు కాగా, బుధవారంనాడు 1531.92 అడుగులుగా నీటిమట్టం ఉంది. డ్యాంలో 101.46 టీఎంసీలు నీటి నిల్వ ఉంది. తుంగభద్ర నదీతీర ప్రాంతంలో గల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆయా జిల్లాల పోలీసు యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. కంప్లీ-గంగావతి మార్గంలో తుంగభద్ర నదిపై ఉన్న వంతెనను తాకుతూ వరద ప్రవాహం ఉండడంతో మార్గంలో వాహనాల రాకపోకలు నిలిపివేస్తూ పోలీసులు ముందు జాగ్రత్తగా అడ్డంగా బారికేడ్లు నిర్మించారు.

## జాతీయ ప్యారా ఈత పోటీల్లో బళ్లారి జిల్లాకు ఏడు పతకాలు

బళ్లారి, అక్టోబర్23, ప్రభాతవార్త;


జాతీయ ప్యారా పోటీల్లో 7 పతకాలు సాధించిన ఈత క్రీడాకారుల్ని అభినందిస్తున్న కోచ్ రజనీలక్క

గోవా రాష్ట్రంలోని పణజిలో ఈనెల 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి ప్యారా ఈత పోటీల్లో బళ్లారి జిల్లాకు ఒక బంగారు, నాలుగు వెండి, రెండు కంచు పతకాలతో మొత్తం ఏడు పతకాలు లభించాయి. బళ్లారి జిల్లా నుంచి స్విమ్మింగ్ క్రీడాకారులైన సాయినిఖీల్, గోపీచంద్, బేబిసాయి, కవితలు పాల్గొన్నారు. వివిధ ఈత విభాగాల్లో సాయినిఖీల్‌కు ఒక బంగారు పతకం, ఒకటి కంచు పతకం లభించగా, గోపీచంద్‌కు మూడు వెండి పతకాలు, బేబీసాయికి ఒక వెండి పతకం, కవిత ఒక కంచు పతకం సాధించారు. నగరానికి చెందిన ఈత కోచ్‌లు రజనీలక్క, శరత్‌గాయక్‌వాడ్‌ల మార్గదర్శకంలో వీరంతా శిక్షణ పొందారు. వీరి సాధన మెచ్చి రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర, సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జెడ్పీ సీఈఓ రాహుల్‌శరణప్ప సంకనూరు, ఏడీసీ మహ్మద్‌జుబేరా, జిల్లా యువజనసేవలు, క్రీడాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.గ్రేసీలు అభినందనలు తెలిపారు.

06ATP27_06ATP27.qxd 23-10-2024 PM 10:19 Page 1



## నీటి పథకాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

అగళి, అక్టోబర్ 23 ప్రభాతవార్త


నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఇరిగేపల్లి, అల్లికెర గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే రాజు, ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి బోరును తవ్వించడంతో సంవృద్ధిగా నీరు పడ్డాయి. సదరు నీటి పథకాలను స్విచ్చాన్ చేసి నీటిని ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ గుండుమల వదిలారు. ఇరవై ఏళ్లుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న తమ గోడును ఎవరూ పట్టించు కోవడం లేదని ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ గుండుమల చొరవ తీసుకుని 20 ఏళ్ల సమస్యను 10 రోజుల్లో పరిష్కరించారని, తమ గ్రామ దాహార్తిని తీర్చారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కృష్ణ, అర్జునుల మాదిరి ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ గ్రామల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నారని ప్రజలు వీరి పనితీరును ప్రశంసించారు. వీరి వెంట జడ్పిటిసి ఉమేష్, కన్వీనర్ కుమారస్వామి, ఎస్.వి.చలపతి, సీనియర్ నాయకులు శివకుమార్, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, శ్రీనివాస్‌ఆచార్, కృష్ణప్ప, మంజునాథ్, సర్పంచు రంగయ్య, లింగరాజు, షౌకతలి, రవికుమార్, జయరామ్, నారాయణప్ప, గురుమూర్తి, మంజునాథ్, మండలంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాల్మీకి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

అగళి, అక్టోబర్ 23 ప్రభాతవార్త

పూలపల్లి గ్రామంలో వాల్మీకి జయంతి వారోత్సవంలో భాగంగా వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకి సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాల్మీకి రామాయణాన్ని రచించి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని, యువత వాల్మీకి అడుగు జాడల్లో నడవాల్సిన అవసరం ఉందన్నారు. వాల్మీకి రామాయణం ఈ సమాజానికి దిశ నిర్దేశం చేస్తుందన్నారు. చిన్నప్పటి నుంచి రామాయణాన్ని చదివి ఆకలింపు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, కన్వీనర్ కుమారస్వామి, మల్లికార్జున, సర్పంచు నరసింహమూర్తి, రమేష్, డాబా రంగ, రెడ్డి, తిప్పేస్వామి, శివప్ప తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

## రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైన రామగిరి జూనియర్ కళాశాల విద్యార్థి

రామగిరి, అక్టోబర్ 23 ప్రభాతవార్త


రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థి ముద్దుకృష్ణ

జాతీయ స్థాయి జూడో పోటీలో రామగిరి జూనియర్ కళాశాలకు చెందిన ముద్దకృష్ణ అండర్ -17 రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ యాదవ్ బుధవారం తెలిపారు. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 2021 తేదీలలో కాళహస్తిలో అండర్-17 జూడో జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. నవంబర్ 4వ తేది జమ్ముకాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ముద్దుకృష్ణ పాల్గొంటారని ఆయన తెలిపారు. జాతీయ స్థాయిలో రాణించి కళాశాలకు పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆకాంక్షించారు.

## జాతీయస్థాయి జూడో పోటీల్లో నసనకోట పాఠశాల విద్యార్థి ప్రతిభ

రామగిరి, అక్టోబర్ 23 ప్రభాతవార్త


జాతీయస్థాయి జూడో పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం

జాతీయస్థాయి జూడో పోటీలలో మండలంలోని నసనకోట పాఠశాల విద్యార్థి జయసింహా ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల పిడి చామంతి తెలిపారు. ఈ నెల 4వ తేది నుంచి 8వ తేది వరకు గుజరాత్‌లో జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14 విభాగంలో జాతీయస్థాయి జూడో పోటీలలో 25 కెజిల విభాగంలో ప్రతిభ కనబర్చిన కాంస్య పతకం సాధించాడని పిడి తెలిపారు. దీంతో జయసింహాను పాఠశాల హెచ్‌ఎం, పిడి, ఉపాధ్యాయులు సన్మానించారు.

## తుఫాను బాధితులను తప్పకుండా ఆదుకుంటాం..

**- నష్ట పరిహారం అందేలా చర్యలు : ఆర్డిఓ మహేష్**

ధర్మవరం, అక్టోబర్ 23 ప్రభాతవార్త


ఆర్డిఓ మహేష్

కుఫాను బాధితులను ధర్మవరం రెవెన్యూ డివిజన్‌పరిధిలో తప్పక ఆదుకుంటామని ధర్మవరం ఆర్డిఓ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 22వ తేదిన కురిసిన భారీ వర్షానికి నష్టం వాటిల్లిందని ఇందులో ముదిగుబ్బ 07, చెన్నేకొత్తపల్లి 19, కనగానపల్లి 05, రామగిరి 08 మొత్తం వెరసి 39 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. అదే విధంగా పంటల విషయంలో చెన్నేకొత్తపల్లి మండలంలో 62 ఎకరాల 49 సెంట్లు, కనగానపల్లి 215 ఎకరాలు, రామగిరిలో 95 ఎకరాలు వెరసి 380 ఎకరాల 68 సెంట్లలో పంట నష్టం జరిగిందని తెలిపారు. అదే విధంగా ముదిగుబ్బ మండలంలో పొడ రాళ్లపల్లిలో 32 గొర్రెలు, రామగిరిలో ఒక ఆవు వెరసి 33 పశువులు మృతి చెందడం జరిగిందని తెలిపారు. వీటిపై నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపడం జరిగిందని ధర్మవరం ఆర్డిఓ మహేష్ తెలిపారు.

## గోరంట్ల సిఐ చొరవతో రహదారికి మరమ్మతులు

గోరంట్ల, అక్టోబర్ 23 ప్రభాతవార్త


దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న సిఐ

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పాటు చిత్రావతి నది పొంగిపొర్లుతుండడంతో నీటి ప్రవాహానికి చిత్రావతిపై రహదారి మట్టికొట్టుకపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీంతో తనవంతు బాధ్యతగా చొరవ తీసుకుని దగ్గరుండి టిప్పర్లతో మట్టిని తోలించి చిత్రావతి నదిపై రోడ్డు మరమ్మతుకు నాంది పలికారు గోరంట్ల సిఐ శేఖర్. మండలంలోని బూదిలి గ్రామం వద్ద నుండి రెడ్డిచెరువు కట్ట వరకు వున్న ప్రధానమైన రహదారి చిత్రావతి నదిపై సాగుతోంది.


రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్న పోలీసులు

అయితే గత ప్రభుత్వ హయాంలో చిత్రావతి నదికి అడ్డంగా నిర్మించిన బ్రిడ్జి కొట్టుకపోవడంతో అక్కడ శాశ్వత బ్రిడ్జి నిర్మాణానికి నోచుకోక అప్పటి పాలకులు తాత్కాలికంగా మట్టి రోడ్డును వేసిన విషయం తెలిసిందే. బెంగుళూరు నుండి కదిరి మీదుగా వెళ్లే భారీ వాహనాలు ఆ దారి గుండా వెళుతున్న నేపథ్యంతో పాటు బూదిలి వద్ద గల గార్మెంట్స్ ఫ్యాక్టరీకి వందలాది మంది మహిళలు ప్రతి రోజు వస్తుపోతుండడం అలాగే ఐదు గ్రామాల విద్యార్థులు ప్రతిరోజు ఆ బ్రిడ్జి మీదుగా బూదిలి హైస్కూల్‌కు వస్తూ పోతుంటారు. ఈ బ్రిడ్జికి ఇంత ప్రాధాన్యత వుండడాన్ని గమనించిన సిఐ సొంతంగా రోడ్డు మరమ్మతుల కోసం ముందుకొచ్చారు. ఈ బ్రిడ్జిపై నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా వున్న నేపథ్యంలో ఏదైనా ప్రమాదాలు జరగకుండా వుండేందుకు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ప్రత్యేక వాహనాలతో మట్టిని తెప్పించి మరమ్మతు కార్యక్రమాలు చేపట్టడంతో వాహనదారులు, ఆ ప్రాంతవాసులు సిఐని అభినందిస్తున్నారు.

## కస్తూరి రంగనాథుని ఆలయానికి సిఐ పూలరామకృష్ణ రూ.40 వేలు విరాళం

గోరంట్ల, అక్టోబర్ 23 ప్రభాతవార్త


ఆలయ నిర్వాహకులకు విరాళం అందచేస్తున్న దశ్యం

మండలంలోని వానవోలు గ్రామంలో వెలసిన పురాతనమైన శ్రీకసూర్తి రంగనాథ స్వామి ఆలయం జీర్ణోద్ధరణ కోసం వానవోలు పంచాయతీ పెట్లకుంట పల్లి గ్రామానికి చెందిన పూల పెద్దవెంకటరామప్ప జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కర్నూల్ జిల్లాలో సిఐగా విధులు నిర్వహిస్తున్న పూల రామకృష్ణ తనవంతుగా 40 వేల రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలియచేశారు.

## చట్టాలను అపహాస్యం చేసే వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి

గుంతకల్లు, అక్టోబర్ 23 ప్రభాతవార్త


నిరసన తెలుపుతున్న దళిత సంఘం నాయకులు

భారత రాజ్యాంగం కల్పించిన చట్టాలను అపహాస్యం చేస్తూ ఎస్‌సి, ఎస్‌టి సామాజిక వర్గాలకు అన్యాయం చేసే వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీలో ఇతర సామాజికవర్గం వారికి చోటు కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు ఎస్‌సి, ఎస్‌టి ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. గతంలో ఇక్కడ ఆర్డీఓగా పనిచేసిన శ్రీనివాసులురెడ్డి మానిటరింగ్ కమిటీ సభ్యుల ఎంపిక విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపించారు. చట్టాలను తమకు ఇష్టంవచ్చినట్లు మార్చుకుంటామంటే సహించేదిలేదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి మానిటరింగ్ కమిటీలో ఎస్‌సి, ఎస్‌టిలకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి రక్షణ సమితి అధ్యక్షులు మహేంద్ర, దళిత సంఘాల నాయకులు తగరం రామాంజినేయులు, భీమలింగ, కోరి చంద్రశేఖర్, నరసింహులు, మల్లికార్జున, మోహన్, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## 15వ ఆర్థిక సంఘం నిధులను నిగ్గు తేల్చండి

**-ఎంపిడిఒకు విన్నవించిన సిపిఎం నాయకులు**

గుంతకల్లు, అక్టోబర్ 23 ప్రభాతవార్త


ఎంపిడిఒకు వినతిపత్రం అందచేస్తున్న సిపిఎం నాయకులు

మండలంలోని నెలగొండ గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగంపై నిగ్గు తేల్చాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఎంపిడిఒ శ్రీకాంత్‌చౌదరికి విన్నవించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో సాగునీటి కోసం 16 లక్షలు ఖర్చు చేసినట్లు చూపి స్వాహా చేశారని ఆరోపించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై నిధులను దోచుకున్నారన్నారు. పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దుర్వినియోగమైన నిధులు రాబట్టి గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఉపయోగపడేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. వినతిపత్రం అందచేసిన వారిలో నాయకులు మారుతిప్రసాద్, కసాపురం జగ్గలి రమేష్, సాకే నాగరాజు, సురేంద్ర, పాల్గొన్నారు.

## 25న పెన్నహోబిళంలో శ్రీవారి హుండీల లెక్కింపు

**-ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు**

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీలను ఈనెల 25వ తేదీన ఉదయం 9 గంటల నుంచి లెక్కించడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేవాదాయశాఖ జిల్లా సహాయ కమీషనర్ ఉత్తర్వుల మేరకు పర్యవేక్షణ అధికారుల సమక్షంలో హుండీలను లెక్కించడం జరుగుతుందని వెల్లడించారు.

## మంత్రి పయ్యావుల కేశవ్ కృషివల్లే భూసేకరణ, ఇంటిస్థలాల పంపిణీ

**- దిగజారుడు రాజకీయాలు చేస్తుండటంతోనే నాయకులు వైసీపీను వీడుతున్నారు - మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై తెలుగుదేశం పార్టీ నాయకుల మండిపాటు**

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

ప్రస్తుతం మంత్రిగా ఉన్న పయ్యావుల కేశవ్ కృషి, ఒత్తిడివల్లే నాడు వైఎస్సార్ ఉరవకొండ పట్టణంలో పేదలకు పట్టాలివ్వడం కోసం 88 ఎకరాల భూమిని కొనగోలు చేశారని, ఈక్రమంలో ఎమ్మెల్యేగా పయ్యావుల కేశవ్ 2019లో పట్టణంలోని 3,100 మంది పేదలకు ఇంటిపట్టాలు పంపిణీ చేశారని అన్ని అర్హతలు ఉన్నాయి కనుకే కొలిమి, రాయంపల్లి లేఅవుట్‌లకు మంత్రి పేరును పెడుతున్నామని తెలుగుదేశం పార్టీ నాయకులు స్పష్టం చేశారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు ఎన్.విజయభాస్కర్, కార్యదర్శి మోపిడి గోవిందు, పట్టణ అధ్యక్షులు మాదినేని రామాంజినేయులు, మాజీ వైస్ ఎంపీపీ పి.రాజేష్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మెన్ రేగటి నాగరాజు, మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు పి.నిరంజన్‌గౌడ్, ఎం.రామాంజినేయులు, చేజాల ప్రభాకర్, మీనుగ రవి తదితరులు మాట్లాడారు. జగనన్న కాలనీకు మంత్రి పయ్యావుల పేరు పెట్టడంపై మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చంద్రబాబు ఫోటో తీసివేసి జగన్ ఫోటో వేసుకొని పట్టాలివ్వడంతప్ప చేసిందేమీ లేదన్నారు. ఈక్రమంలోనే పంచాయతీలో మెజార్టీ వార్డు సభ్యుల ఆమోదం మేరకే మంత్రి పేరు పెట్టడానికి తీర్మాణం జరిగిందని ఇందులో ప్రలోభాల ఊసే లేదన్నారు. మంత్రి కేశవ్ 30 సంవత్సరాలుగా నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో శ్రమించారని కాలనీలకు పేరు పెట్టుకునే అర్హత ఆయనకు మాత్రమే ఉందన్నారు. జగన్ దశలవారి మద్యపాన నిషేదం అమలు చేస్తామని ప్రజలకు నకిలీ, నాశిరకం మద్యం అంటగట్టి ఎన్నో ప్రాణాలు బలిగొన్నారని అలాంటి పార్టీ నాయకులు నేడు నీతులు చెబుతుండటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో నాయకులు బి.సు ఒకన్న, ఈడిగ వేణుగౌడ్, ఎం.పెద్దన్న, బి.గోపాల్, కె.రమేష్, ఎం.వరప్రసాద్, శంకర సుదర్శన్, వడ్డే లాలుస్వామి, నిమ్మల ప్రసాద్, వీరేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ అక్రమార్కులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

**- ఉపాధిహామీ కార్యాలయం ముందు సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ ధర్నా- కూలీల కడుపుకొట్టి లక్షలాది రూపాయలు దోచుకున్నారని ఆగ్రహం- ప్రజా వేదికలో బయటపడ్డ నిధుల దుర్వినియోగంపై చర్యలకు డిమాండ్**

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త


ఉపాధిహామీ కార్యాలయం తలుపులు మూసివేసి ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన అధికారు లపై క్రిమినల్ చర్యలు తీసుకోవా లని సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీలు డిమాండ్ చేశాయి. పట్టణం లోని ఉపాధిహామీ కార్యాలయం ముందు బుధవారం ఆయా పార్టీలు ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎం.బి.చెన్నరాయుడు, సీపీఎం పార్టీ ప్రాంతీయ కార్యదర్శి ఎ.రంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఎన్.మధుసూదన్, కాంగ్రెస్ పార్టీ డీసీసీ కార్యదర్శులు అబ్బాస్, ఇంద్రావతి ఓబులేసు తదితరులు మాట్లాడుతూ మండలంలో గత ఏడాది 9.15 కోట్ల రూపాయలతో ఉపాధి పనులు జరిగితే సామాజిక తనిఖీ బృందాలు ప్రజా వేదికలో 78.66 లక్షల రూపాయలు దుర్వినియోగం జరిగిందని బయట పెట్టారన్నారు. అయితే ఇంకా బయటకు రాని అక్రమాలు కూడా అనేకం ఉన్నాయని ఒక్క ఎడాదిలోనే ఇంత పెద్దఎత్తున అధికారులు అక్రమాలకు పాల్పడితే గడిచిన ఐదేళ్ళలో ఎన్నికోట్ల రూపాయలు కూలీల కడుపుకొట్టి దోచుకున్నారో అర్థమవుతోందన్నారు. నిధుల దుర్వినియోగం బయటపడినా డ్వామా అధికారులు వాటిని రికవరీ చేయకుండా 62.11 లక్షల రూపాయలను డ్రాప్ చేసి కేవలం 9.29 లక్షల రూపాయలు మాత్రమే రికవరీకు రాయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. తిలా పాపం తలా పిడికెడు అన్న చందంగా నిధులను కలిసి పంచుకొని అక్రమ అధికారులను కాపాడే ప్రయత్నం జరిగిందని స్పష్టం అవుతోందన్నారు. నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యతులపై క్రిమినల్ చర్యలు తీసుకోని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ ఆయా పార్టీల నాయకులు ఇంద్రావతి వెంకటేష్, మురళి తదితరులు, రాజు పాల్గొన్నారు.

## ఆర్అండ్‌బీ అధికారులతో సంప్రదించి పీహెచ్‌సీను నూతన భవనాల్లో మార్చండి

**- రాకెట్ల పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఛైర్మెన్ ఎం.నరసింహులు**

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త


రాకెట్ల పీహెచ్‌సీలో జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశం దృశ్యం

ఆర్అండ్‌బీ అధికారులతో సంప్రదించి పెండింగ్ పనులు పూర్తీ అయ్యేలా చూసి పీహెచ్‌సీను నూతన భవనాల్లో మార్చాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ ఎం.నరసింహులు సూచించారు. మండల పరిధిలోని రాకెట్ల పీహెచ్‌సీలో బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంకు ఆయన అధ్యక్షత వహించగా ఎంపీడీఓ బి.వి.రవిప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి విడుదలై నిధులు, వాటితో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అజెండాలోని అంశాలపై చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బి.వి.రవిప్రసాద్ మాట్లాడుతూ పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వాటిని ప్రజలు సది ్వనియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డి.శివమ్మ, ఆసుప త్రి వైద్యులు డాక్టర్ పావని, డాక్టర్ వెంకటేష్‌నాయక్, గ్రామ పెద్దలు అశోక్‌కుమార్, సిసింద్రీ, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ షఫీ, సూపర్‌వైజర్ శేఖర్, జూనియర్ అసిస్టెంట్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## అమరాపురం రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ ఉన్నట్లా లేనట్లా ?

అమరాపురం, అక్టోబర్ 23 ప్రభాతవార్త



అమరాపురం తహశీల్దార్ కార్యాలయంలో ప్రజలకు రెవెన్యూ పరమైన సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రస్తుతం ఎఫ్‌ఎసి కింద ఇన్‌చార్జ్ తహశీల్దార్‌ను నియమించినా కూడా రెవెన్యూ పరరమైనటువంటి పనులు జరగడంలేదని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అమరాపురం మండల తహశీల్దార్ వున్నట్లా లేనట్లా అనే సందేహం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు మెటేషన్లుగాని ఎఫ్‌ఎంసిలుగా గానీ చదువుకునే విద్యార్థులకు కుల, ఆదాయ ధృవీకరణపత్రాల కొరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసినా కూడా అందడంలేదని ప్రజలు వాపోతున్నారు. సకాలంలో అధికారులు చేయకపోవడంతో రెజెక్ట్ అయి మరలా ఆన్‌లైన్ నమోదు చేసుకనే పరిస్థితి రైతులకు, విద్యార్థులకు నెలకొంది. ప్రస్తుతం ఎఫ్‌ఎసిగా రెగ్యులర్ డిటిని ఉన్నతాధికారులు అమరాపురం తహశీల్దార్‌గా నియమించారు. అయితే ఎన్నికల విధుల్లో భాగంగా మడకశిర ఎన్నికల డిప్యూటి తహశీల్దార్ గానే విధుల్లో వున్నందున ప్రస్తుతం ఎఫ్‌ఎసి కింద ఇన్‌చార్జ్ తహశీల్దార్ పూర్తిస్థాయిలో ప్రజలకు న్యాయం చేయలేని పరిస్థితిలో వున్నట్లు సమాచారం. ప్రతినిత్యం ప్రజలు మీ సేవ, సచివాలయం, రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగే పరిస్థితి నెలకొంది. దీనిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి అమరాపురం మండలానికి పూర్తిస్థాయి తహశీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

## మెప్మా బజార్‌కు విశేష ఆదరణ

గుత్తి, అక్టోబర్ 23 ప్రభాతవార్త


మెప్మా బజార్‌ను ఛైర్‌పర్సన్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌కు ప్రజల నుండి విశేష ఆదరణ కానవచ్చింది. బుధవారం మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల మహిళలు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్‌ఛైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమీషనర్ జబ్బార్‌మియాలు ఈ మెప్మా బజార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్దఎత్తున వస్తువులను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, సురేఖ, మహబూబ్‌బాషు, తదితరులు పాల్గొన్నారు.

## నిద్రగట్ట చెరువులో చేపల పెంపకం కొరకు వేలంపాట

అమరాపురం, అక్టోబర్ 23 ప్రభాతవార్త

మండలంలోని నిద్రగట్ట చెరువులో చేపల పెంపకం కొరకు బుధవారం బహిరంగవేలం గ్రామ పంచాయతీ సర్పంచు రాధమ్మ లోకేష్ అధ్యక్షతన ఇఆర్‌డి నాగముని సమక్షంలో గ్రామ కార్యదర్శి ఈరన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిద్రగట్ట గ్రామానికి చెందిన వాల్మీకి అనిల్‌కుమార్ 2.46లక్షలతో వేలంపాట దక్కించుకున్న కార్యదర్శి ఈరన్న తెలిపారు. ఈ మొత్తాన్ని పంచాయతీ అభివృద్ధికి వెచ్చించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

## అనాధాశ్రమంలో అన్నదానం

గుత్తి, అక్టోబర్ 23 ప్రభాతవార్త


అన్నదానం చేస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని కొత్తూరులో వున్న స్వీట్ సేవియర్ ట్రస్ట్ అనాధాశ్రమంలో బుధవారం ఉపాధ్యాయుడు సోమప్ప మూడవ వర్థంతి సందర్భంగా ఆయన కుటుంబీకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు, పిల్లలకు భోజన సౌకర్యం కల్పించారు. గత మూడు సంవత్సరాలుగా ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు గుత్తికోట సంరక్షణ సమితి కన్వీనర్ విజయభాస్కర్‌చౌదరి, టీచర్ కుమార్తె లక్ష్మీ, అల్లుడు వరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జగన్నాథ్, సునీత, పాల్గొన్నారు.

## డ్రైవర్లకు అవగాహన కల్పించిన పోలీసులు

పెనుకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త:


పట్టణంలో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

అమరవీరుల వారోత్సవాలు పురస్కరించుకొని బుధవారం మండల పరిధిలోని కియా పోలీస్ స్టేషన్ ఎస్సై రాజేష్ పట్టణంలో ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని గ్లోబల్ జెన్ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు ఓపెన్ హౌస్ గురించి వివరించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ విధివిధానాలు గురించి ఎస్సై వెంకటేశ్వరున్ల అవగాహన కల్పించారు. సమాజంలో జరుగుతున్న నేరాలు గంజాయి, అమ్మకాలు, డ్రగ్ సేవించడం, బాలికలపై అత్యాచారాలు వంటి విషయాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తదనంతరం పట్టణంలోని రైల్వే స్టేషన్లో డ్రైవర్లకు ఎస్సై వెంకటేశ్వర్లు మక్కాజి పల్లి రైల్వేస్టేషన్‌లో ఆటో డ్రైవరన్లకు ఎస్సై రాజేష్‌లు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మద్యపానం సేవించడం, హెల్మెంట్ ధరించకపోవడం, సీట్ బెల్టు పెట్టుకోకపోవడం, అతివేగం వంటి అంశాల వల్ల జరిగే అనార్థాలను డ్రైవర్లకు వివరించారు.

## ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ గోరంట్లలో ఎన్నిక

గోరంట్ల, అక్టోబర్ 23 ప్రభాతవార్త


ఎన్నికైన జిల్లా సారథులు

శ్రీసత్యసాయి జిల్లా ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం గోరంట్లలోఎంపిక చేశారు. ఇందులో జిల్లాశాఖ గౌరవాధ్యక్షులుగా పెనుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పి.ఫజ్లేకరీం, అధ్యక్షులుగా కొత్తచెరువు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్‌సమీవుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పరిగి జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఏ.నిసారుల్లాహ్, జిల్లా కోశాధికారిగా కొడిగినహళ్లి మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.ఖాజావలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో ఎన్నిక జరిగింది. జిల్లా అసోసియేషన్ అధ్యక్షులుగా నూర్‌షరీఫ్, మసీఉల్లా, అప్పాజీ, ఉపాధ్యక్షులుగా అనీఫ్‌అహ్మద్, మొహిద్దీన్, జబీవుల్లా, అదనపు ప్రధాన కార్యదర్శులుగా సైఫుద్దీన్, మహమ్మద్‌యాకూబ్, ఇర్షాన్‌అహ్మద్, కార్యదర్శులుగా అబ్దుల్‌రజాక్, వసీంఅహ్మద్, మహమ్మద్‌ఈదుల్లాఅను ఎన్నుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారిగా రూట రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఫైరోజ్‌అహ్మద్, ఎన్నికల పరిశీలకులుగా రూట రాష్ట్ర కన్వీనర్ ఆరిఫ్‌అమీనిలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

05ATP23_05ATP23.qxd 23-10-2024 PM 10:40 Page 1



## ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండండి - డిఎస్‌పి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఎస్‌పి రామకృష్ణుడు

**తాడిపత్రిరూరల్, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

ఫ్యాక్షన్‌కు దూరంగా వుంటూ ప్రశాంతంగా జీవించాలని డిఎస్‌పి రామకృష్ణుడు పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండలంలోని వీరాపురం గ్రామంలో ఇరుపార్టీలకు చెందిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, ఫ్యాక్షన్ కార్యకలాపాలకు ప్రేరేపించినా, ప్రశాంతతకు భంగం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## మట్కా బీటర్ అరెస్ట్



మట్కా బీటర్‌ను అరెస్ట్ చేసిన దృశ్యం

**యల్లనూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

మండలంలోని కొడవండ్లపల్లి గ్రామానికి చెందిన తిరుపతినాయుడు అనే మట్కా బీటర్‌ను బుధవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సిఐ సత్యబాబు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐ వివరాలు వెల్లడించారు. కొడవండ్లపల్లి గ్రామ పొలాల్లో మట్కా నిర్వహిస్తున్నాడన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు జరిపి తిరుపతినాయుడును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 2,02,500 రూపాయల నగదుతో పాటు మట్కా పట్టీలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అనంతరం సిఐ మాట్లాడుతూ కుటుంబాలు బాగుండాలంటే మట్కా మహమ్మారికి దూరంగా వుండాలన్నారు. లేకుంటే కుటుంబాలు నాశనమవుతాయన్నారు. పిల్లలను చదివించుకుని మంచి ప్రయోజకులకు తీర్చిదిద్దాలని అలాగే వ్యవసాయం చేసుకుని ప్రశాంతంగా జీవించాలని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీరామ్‌ప్రసాద్, ఎఎస్‌ఐ సంపత్, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్, శంకరయ్య, కానిస్టేబుల్ నాగరాజు, అంకులప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహవేడుకకు హాజరైన రమేష్‌రెడ్డి



వధూవరులను ఆశీర్వదిస్తున్న రమేష్‌రెడ్డి

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

పట్టణ సమీపంలోని పుట్లూరురోడ్డులో వున్న ఎఆర్‌ఆర్ గార్డెన్స్‌లో బుధవారం జరిగిన వివాహ వేడుకకు వైసిపి రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో ఆయనతో పాటు పలువురు వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## 6 ఇసుక ట్రాక్టర్లు సీజ్

**తాడిపత్రిరూరల్, అక్టోబర్ 23 ప్రభాతవార్త**



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

మండలంలోని బుగ్గ రోడ్డులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 6 ట్రాక్టర్లను బుధవారం సీజ్ చేసినట్లు రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు జరిపి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

## సమస్యలను పరిష్కరిస్తాం తహశీల్దారు

**గాండ్లపెంట, అక్టోబర్ 23 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న తహశీల్దారు బాబురావు

మండలంలోని మల మీదపల్లి పంచాయితీలో ఈ సర్వేపై గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు బాబురావు మాట్లాడుతూ.. తమకు వచ్చిన వినతులను త్వరగా పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అయితే గ్రామ సభలో 9 వినతిపత్రాలు రైతులు తహశీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓ జాఫర్ అలీ, సర్వేర్లు రైతులు పాల్గొన్నారు.

## శివమొగ్గ జిల్లాలో కురిసిన జోరువానలకు వందలాది ఎకరాల్లో వరిపంట ధ్వంసం

**శివమొగ్గ,అక్టోబర్ 23,ప్రభాతవార్త ప్రతినిధి**

మలెనాడు ప్రాంతంలోని శివమొగ్గ జిల్లాలో గత రెండురోజులుగా కురిసిన భారీ వానల వలన అనేకచోట్ల కోతకు వచ్చిన వరిపంట వరదనీటిలో కొట్టుకుపోయి వందలాది రైతులకు కన్నీళ్లు పెట్టించింది. శివమొగ్గ రూరల్ ప్రాంతంలోని కక్కిల గ్రామంలో కోతకు వచ్చిన వరిపంట వందల ఎకరాల్లో ఉంటే హఠాత్తుగా కురిసిన భారీ వానల వలన వరదలుఏర్పడి వరిపంట మొత్తంలో వరదనీటిలో కొట్టుకుపోయింది. రెండు మూడురోజుల్లో కోతలు చేపట్టాలని సిద్ధపడిన రైతులకు అకాల వర్షాలు నష్టాన్ని తెచ్చాయి. చేతికి అందివచ్చిన పంట నోటికాడకు రాలేదని రైతులు వాపోయారు. సర్కారు అధికారులు వెంటనే సర్వేజరిపి తమ పంటల నష్టానికి పరిహారం ఇప్పించాలని మనవి చేశారు.

## ఇల్లు ఖాళీ చేయలేదని బావను హత్యచేసిన దుండగుడు

**చిక్కమగళూరు,అక్టోబర్ 23,ప్రభాతవార్త ప్రతినిధి**

చిక్కమగళూరు పట్టణంలోని తమిళు కాలనీ ఏరియాలో గోపాల్ అనే వ్యక్తి తన బావ నుంచి మూడు సంవత్సరాల కిందట 25వేల రూపాయలతో ఇల్లు కొనుగోలు చేశాడు. అప్పటినుంచి అదే ఇంట్లో బావ మంజునాథ్ అద్దెకు ఉంటున్నాడు. ఇటీవల ఈ ఇంటిని ఖాళీ చేయాలని గోపాల్ కోరగా బావ నిరాకరించాడు. దీంతో గోపాల్ కోపగించుకుని బుధవారం బావతో గొడవపడి అతడి తలపైన ఇటుకరాయితో బాది హత్య చేశాడు. ఈ సమాచారం తెలుసుకున్న చిక్కమగళూరు పోలీసులు స్థలానికి వెళ్లి దుండగుడిని అరెస్టు చేశారు.

## ఆర్డీటి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం



మానవహారంతో నినాదాలు తెలుపుతున్న విద్యార్థినీలు

**నల్లచెరువు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:**

నల్లచెరువు మండల కేంద్రంలోని బుధవారం ఆర్డీటి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమాన్ని ఏటిఎల్ సుకన్య నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూర్బా స్కూల్ బాలికలు, ఉపాధ్యాయులతో సిబ్బందితో కలిసి గ్రామంలో పురవీధుల్లో గుండా ర్యాలీత శ్లోకములు, పలుకుతూ ర్యాలీని నిర్వహించారు. అమ్మాయిలకు ప్రపంచాన్ని మార్చగల ధైర్యం ఇస్తామని ఆడపిల్లలు దేవుడు ఇచ్చిన వరం భారం కాదని సమాజానికి అవగాహన కల్పించాలని సమాజంలో సమానంగా చదివిద్దాం బ్రతకనిద్దామని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ నందు మానవహారం పాటించారు. అదే విధంగా గీతా మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమం సందర్భంగా ముఖ్యఅతిథులుగా పర్చేస్ డైరెక్టర్ శ్రీమతి పుష్పలత మాట్లాడుతూ ఆడపిల్లలు ఏ రంగాల్లో కూడా అబ్బాయిల కన్నా తక్కువ కాకూడదని అన్నిట్లోనూ కూడా ఈ రోజు విజయం సాధిస్తున్నారని తెలిపారు. ఎంఈఓ తిరుపాల్‌నాయక్ మాట్లాడుతూ ఆడపిల్లలకు సమాజంలో వివక్షతకు గురి అవుతున్నారని, ఆడపిల్లలకు గౌరవం రావాలంటే ఇంటిలో మనం మారాలి మన కుటుంబం మారాలి బాగా చదువుకొని సమాజంలో గౌరవప్రదంగా జీవితం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ రంజాన్, రాంప్రతాప్‌రెడ్డి, సిఓ నారాయణస్వామి, కృషితజయరామప్ప, జనార్ధన్ పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని యువకుడు మృతి

**నల్లచెరువు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:**



ఉరి వేసుకున్న వెంకటేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మక్బుల్ బాష

నల్లచెరువు మండలంలోని వేమన స్వామి గుడి పరిసరాల్లో దశరథ రామయ్య నాయుడు పొలంలో గల బండ చింత చెట్టుకు జీ.వెంకటేష్ (26) మంగళవారం రాత్రి సమయంలో ఉరివేసుకొని బలవర్మణంతో మృతి చెందాడు. బుధవారం ఉదయం పరిసర ప్రాంతంలో గల గ్రామ ప్రజలు స్థానిక ఎస్సై మక్బుల్‌బాషకు విషయం తెలపగా తోటి సిబ్బందితో అక్కడి చేరుకొని ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడు గత వివరాలు కుటుంబ సభ్యులతో వివరాలు అడుగగా వారు తెలిపిన వివరాల మేరకు బార్య పుట్టింటికి వెళ్లిందని, తాగుడుకు బానిస అయ్యాడని తల్లి మందలించగా మృతుడు జీవితం మీద విరక్తి చెందడంతో మంగళవారం రాత్రి సమయంలో ఉరివేసుకున్నట్లు మృతుడు బార్య యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## వ్యక్తి దారుణహత్య

**యాడికి, అక్టోబర్ 23 ప్రభాతవార్త**



హత్యకు గురైన లక్ష్మినారాయణ

మండల కేంద్రంలోని కుంట సమీపంలోని దర్గా, అమ్మవారిశాల మధ్యలో వున్న వీధిలో లక్ష్మినారాయణ అలియాస్ గుర్రం (49) అనే వ్యక్తిని కన్న కొడుకే హత్య చేసి పోలీసుస్టేషన్‌లో లొంగిపోయిన సంఘటన యాడికిలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని ఈరన్నపల్లి గ్రామానికి చెందిన లక్ష్మినారాయణ, వరలక్ష్మి భార్యాభర్తలు, వీరికి కార్తీక్ అనే కుమారుడు వున్నాడు. లక్ష్మినారాయణ భార్యతో విడిపోయి యాడికి వెంగమనాయుడు కాలనీలో వేరే మహిళతో వున్నట్లు. చాలాకాలం తరువాత వీరి కుటుంబంలో ఆస్తి వివాదం కూడా వున్నట్లు సమాచారం. బుధవారం కుంటలో లక్ష్మినారాయణ శవమై కనిపించడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం తెలపడంతో అప్పటికే శరీరంపై కత్తిపోట్లు, బండరాయి శరీరంపై వేసినట్లు వుందని పోలీసులు తెలిపారు. అయితే లక్ష్మినారాయణ చేతిలో కత్తి కూడా వున్నదని సమాచారం తెలుసుకున్న సిఐ ఈరన్న పోలీసు సిబ్బందితో కుంటలో శవాన్ని పరిశీలించారు. కార్తీక్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడని పోలీసులు తెలిపారు. కుమారుడు కార్తీక్ తన తండ్రి లక్ష్మినారాయణను హత్య చేయడానికి గల కారణాలు తెలియాల్సి వుంది. పోలీసులు ఈ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి

**- డిసిహెచ్‌ఓ డా.పాల్ రవికుమార్**

**శింగనమల, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం డిసిహెచ్‌ఓ డా.పాల్ రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ.. వైద్య సేవల కోసం వచ్చిన వారి పట్ల నిర్లక్ష్యం లేకుండా వెంటనే వారికి వైద్య సేవలు అందించాలని రాత్రి సమయంలో వైద్యులు కచ్చితంగా ఉండాలని తెలిపారు. ఎక్స్‌రే, ఇసిజి, రక్త పరీక్షల ల్యాబులను పరిశీలించి పలు సలహాలు అందించారు. అనంతరం ఆయన రికార్డులను పరిశీలించారు.

## సర్వర్ సమస్య కర్ణాటకలో పేదల రేషన్ పంపిణిలో కొనసాగుతున్న జాప్యం

**- ఒక్కో రేషన్‌షాపులో మూడురోజుల పాటు రేషన్ పంపిణి**



**బెంగళూరు,అక్టోబర్ 23,ప్రభాతవార్త ప్రతినిధి**

కర్ణాటక ఆహార పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రతీనెలా కోట్లాదిమంది పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ అక్టోబర్ నెల రేషన్ పంచేందుకు అటు రేషను దుకాణదారులు ఇటు కార్డుదార్లు రేషన్ తీసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటివరకు రాజ్యంలోని నెలానెల రేషన్ పంపిణిను కేంద్రసర్కారు వేర్వేరు ప్రయివేట్ ఏజెన్సీల ద్వారా నిర్వహించటానికి బదులుగా ఈనెల నుంచి రాజ్యసర్కారే నేరుగా తన ఆధీనంలోని డేటా సెంటర్ నుంచి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంది. అనేక జిల్లాల్లో ఈనెల 15నుంచి ఇప్పటివరకు వేలాది రేషనుదుకాణాలు రేషన్‌కార్డుదార్ల వివరాలను ఫీడ్ చేసేందుకు నిత్యం ప్రయత్నిస్తుంటే సర్వర్ సకాలంలో పనిచేయకుండా గంటలతరబడి రేషనుకార్డుదార్లు దుకాణాల ముందు బారులుతీరి నిలబడి ఉంటున్నారు. ఒక్కో దుకాణంలో 500నుంచి వెయ్యికిపైగా కార్డులు ఉండటంతో ఒక్కోదుకాణం రేషన్ పంచేందుకు మూడేసిరోజుల సమయం తీసుకొంటుంది. ఈ సమస్య ఇప్పట్లో పరిహారం అయ్యే అవకాశాలు కనిపించటంలేదు. కేంద్రసర్కారు తన ఆధీనంలోని నేషనల్ ఇన్‌ఫార్మాటిక్స్ సెంటర్ డేటా ద్వారా కేంద్రం కోటాను విడుదల చేసి అన్ని వివరాలను తనవద్దే ఉంచుకోవటంతో సమస్య తలెత్తిందని అధికారులు చెబుతున్నారు.

## మురుగు నీటి అడ్డుకట్టకు మ్యాజిక్ పిట్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపిడి జ్యోతి

**ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

మురుగు నీటిని అడ్డుకట్ట వేసేందుకు ప్రజలు మ్యాజిక్ పిట్‌లను ఉపయోగించుకునేలా అవగాహన కలిగించాలని పుట్టపర్తి క్లస్టర్ ఏపిడి జ్యోతి ఉపాధి హామీ పథకం సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక ఎంపిడీఓ కార్యాలయ సమావేశ భవనంలో అమడగూరు, ఓడిచెరువు మండలాల ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిడీ జ్యోతి మాట్లాడుతూ..... జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ పనులకు వచ్చేలా సిబ్బంది వారికి అవగాహన కలిగించాలన్నారు. వంద రోజులకు సమీపంలో ఉన్న ప్రతి ఒక్కరి వంద పనిదినాలు పూర్తిచేయించాలన్నారు. పండ్ల మొక్కలు పెంపకాని మంజూరైన రైతులు ఈనెల 31లోపు గుంతలు తవ్వి, నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలానికి 1000 మ్యాజిక్‌సోక్‌పిట్‌లు మంజూరయ్యాయన్నారు. సోక్ పిట్‌లకు రూ 5 వేలు అందచేస్తుందన్నారు. మినీ గోకులాలు, గొర్రెలు, కోళ్ల షెడ్‌లకు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడీఓ రాబర్ట్ విల్సన్, ఓడిసి, అమడగూరు ఏపిఓలు సుధాకర్, అమరావతి, ఈసిలు ఆంజనేయులు, ఆనంద్, ఏపిడి అసిస్టెంట్ ప్రతాప్‌రెడ్డి, టిఏలు రాజారెడ్డి, చంద్రారెడ్డి, రాజేంద్ర, హనుమంతరెడ్డి, శివప్రతాప్‌రెడ్డి, అంజినప్ప, లక్ష్మినారాయణ, నల్లప్ప, మంజునాథ్‌తో పాటు క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

## రీ సర్వే భూముల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం



సమావేశంలో ఆర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్

**ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

రీ సర్వే భూముల్లో నెలకొన్న అన్ని సమస్యలకు త్వరిగతిన పరిష్కారం చూపుతామని తహశీల్దార్ అనంతాచారి రైతులకు స్పష్టం చేశారు. మండలంలోని యం కొత్తపల్లిలో బుధవరాం గ్రామ సభ నిర్వహించారు. రెవెన్యూ గ్రామంలోని పలు సమస్యలపై రైతుల నుంచి ఆర్జీలు స్వీకరించారు. రైతులు పేర్కొన్న సమస్యలను క్లుప్తంగా పరిశీలించి సంబంధిత సర్వే నంబర్‌లో ఉన్న రైతులతో మరోసారి చర్చించి రీ సర్వేలోని సమస్యలకు పులిస్టాప్ పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓ కేవి రమణ, సర్వేర్‌లు అనూరాధ, రామాంజి, అశోక్ విఆర్‌ఏలు కొండప్ప, సుమలత, రైతులు జెరిపిటి అంజినప్ప, మోపూరెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వేరుశెనగరైతన్నలు ప్రభుత్వం ఆదుకోవాలి

**తనకల్లు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:**



కుళ్ళిపోయిన పంటను చూపుతున్న రైతు

మండల పరిధిలోని అన్ని గ్రామాలలో నష్టపోయిన వేరుశెనగ, మొక్కజొన్న, వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మండల ప్రజలు కోరారు. తవళం గ్రామానికి చెందిన రైతు తలారి ఆదినారాయణకు చెందిన వేరుశెనగ పంట మొత్తం వర్ష ప్రభావం వల్ల కుళ్ళిపోయి పంట నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు తలారి ఆదినారాయణ మూడు లక్షలు అప్పులు చేసి వేరుశెనగ విత్తనాలు వేసుకున్నాడని, ఎకరాలలో సాగు చేసినటువంటి వేరుశెనగ పంట తొలగించి కుప్పలు వేయగా ఏకధాటిగా నాలుగు రోజులు వర్షం పడడంతో వేరుశెనగ కాయలు మొత్తం కుళ్లిపోయి కాయలు పనికిరాకుండా పోయి నష్టం వాటిల్లిందని, అప్పులుచేసి పంట వేయగా తీర పంట చేతికొచ్చిన సమయంలో తుఫానుతో నష్టపోయానని సంబంధిత అధికారులు స్పందించి మండల ప్రజలకు న్యాయం చేయాలని, లేని పక్షంలో నా కుటుంబం పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుందని , కావున ప్రభుత్వం నన్ను ఆదుకోవాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

## డీలర్ల సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్‌కు వినతి



తహశీల్దార్‌కు విన్నవిస్తున్న డీలర్లు

**అమడగూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

మండలంలోని డీలర్ల సమస్యలను పరిష్కరించాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రామనాథ్‌రెడ్డికి డీలర్లు బుధవారం వినతిపత్రం అందచేశారు. తహశీల్దార్ స్పందిస్తూ గతంలో జరిగిన విధంగా ప్రస్తుత ప్రభుత్వంలో జరగకూడదని విఆర్‌ఓలు, విఆర్‌ఎలు ఆయా షాపుల డీలర్లకు అందుబాటులో వుండాలని ఆదేశించారు. గత రేషన్ షాపు మాజీ డీలర్లు బియ్యం బఫర్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి నోటీసులు పంపాలని ఆర్‌ఐ ఈశ్వరయ్యను తహశీల్దార్ ఆదేశించారు. రేషన్‌షాపు డీలర్లు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందిని తహశీల్దార్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీలర్లు రాజారెడ్డి, బి.భాస్కర్‌రెడ్డి, రెడ్డప్ప లక్ష్మినర్సిరెడ్డి, అనురాధ, కృష్ణారెడ్డి, ప్రసాద్, అంజి, అల్లాబకాష్, లక్ష్మీపతి, గోపాల్, రంగారెడ్డి, కోటిరెడ్డి, నంజిరెడ్డి, బాబు, శంకర్‌నాయుడు, గాయత్రి, కె.భాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి, తుమిల్‌రెడ్డి, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

## ఆర్డీటి ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం



మాట్లాడుతున్న సిఐ ఈరన్న

**యాడికి, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఆర్డీటి ఆధ్వర్యంలో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐ ఈరన్న ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా బాలికలు సమాజంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు అనే అంశంపై రాతపరీక్ష నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటి రీజినల్ డైరెక్టర్ లక్ష్మణరావు, అనంతపురం దాదా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగన్న, తాడిపత్రి ఏరియా ఏటిఎల్ లలిత, ఆర్డీటి కో ఆర్డినేటర్లు ఆంజనేయులు, నాగప్ప, ఓబులేసు, పార్వతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉదయ్ ఆత్మహత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలి



మీడియాతో మాట్లాడుతున్న శ్రీనాథ్, కేశవ

**కదిరి, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

కదిరి రూరల్ మండలంలోని ఎర్రదొడ్డి గ్రామానికి చెందిన ఉదయ్ పోలీసుల వేదింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడ్డాడని ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఉదయ్ సోదరులు శ్రీనాథ్, కేశవ, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు రామచంద్ర, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు రాజశేఖర్‌బాబులు, డిమాండ్ చేశారు. బుధవారం ఉదయ్ సోదరులు అతని తండ్రి ఇతర నాయకులు అప్‌గ్రేడ్ స్టేషన్ సిఐతో పోలీసుల వేదింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డ ఉదయ్ కేసుపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు అంటూ సిఐని ప్రశ్నించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. గతంలో కదిరి రూరల్ సిఐగా పని చేసిన, అక్కడి పోలీసులు సిద్ది పేట పోలీసుల వేదింపులు తాళలేక సెప్టెంబర్ 27న తమ సోదరుడు ఉదయ్ బలవన్మరణానికి పాల్పడ్డాడని, 28న పిఎం జరిగిందన్నారు. తదనంతరం పెనుకొండ డిఎస్పీ విచారణ అధికారిగా వచ్చి నిష్పక్షపాతంగా తమతో, గ్రామస్తులతో పూర్తి స్థాయిలో విచారణ జరిపారన్నారు. అయితే విచారణకు సంబంధించిన పూర్వపరాలు తమకు ఏమీ తెలపలేదన్నారు. సెప్టెంబర్ 27న పోలీసుల వేదింపులు తాళలేక అందుకు కారకులపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఉదయ్ సోదరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం ఉదయ్ ఆత్మహత్యకు కారకులైన వారిని అరెస్టు చేయడంతో పాటు రిమాండ్ విధించాలని లేని పక్షంలో స్టేషన్ ముందు ఆందోళనకు దిగుతామని వారు అన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కేసుకు సంబంధించి వివరాలను తమకు తెలుపుతారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉదయ్ బంధువులు, మాల మహానాడు సభ్యులు పాల్గొన్నారు.

## టికెట్ ఆశించి భంగపడ్డ దివాకర్‌కు రాష్ట్ర కార్యదర్శి పోస్ట్

**- గాలి జనార్ధన్‌రెడ్డి బుజ్జగింపుతో కె.ఎస్.దివాకర్ యూటర్న్**



బీజేపీ కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న పార్టీ జిల్లా ఇన్‌చార్జి కె.ఎస్.నవీన్, గాలి జనార్ధన్‌రెడ్డిలు

**బళ్లారి, అక్టోబర్23, ప్రభాతవార్త;**

సండూరు ఉప ఎన్నికల బరిలో బీజేపీ టికెట్ వస్తుందన్న గంపెడు ఆశతో ఉన్న కొన్ని నెలలుగా సండూరు క్షేత్రంలో విస్తృతంగా ప్రజల మధ్య తిరుగుతున్న కె.ఎస్.దివాకర్‌కు ఆ పార్టీ అధిష్టానం టికెట్ ఇవ్వకపోడంతో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేయాలని తీసుకున్న నిర్ణయం గాలి జనార్ధన్‌రెడ్డి బుజ్జగింపుతో మార్చుకున్నారు.

మంగళవారంనాడు సాయంత్రం జరిగిన అనేక నాటకీయ పరిణామాల నేపథ్యంలో బీజేపీ అధిష్టానం కె.ఎస్.దివాకర్ పార్టీకి అందించిన సేవలను పరిగణించి రాష్ట్ర కార్యదర్శి పదవికి నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో కె.ఎస్.దివాకర్, ఆయన అనచరగణం శాంతించారు. బుధవారంనాడు జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో జరిగిన పత్రికాగోష్టిలో బీజేపీకి చెందిన సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జిగా వచ్చిన కె.ఎస్.నవీన్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. దివాకర్ కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తూ ఉత్తమ వ్యక్తిగా నిలిచారని, గత అసెంబ్లీ ఎన్నికల్లో సండూరు క్షేత్రంలో కేఆర్‌పీపీ పార్టీ నుంచి పోటీ చేసిన కె.ఎస్.దివాకర్ 31 వేల ఓట్లు పొందారన్నారు. గత 25 సంవత్సరాలుగా బీజేపీకి క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీని సంఘటిత పరిచారని, సండూరు టికెట్ ఆశావహుల్లో దివాకర్ పేరు కూడా అధిష్టానం ఎంపిక సమితి జాబితాలో ఉన్నదని, అయితే పార్టీ నాయకులు బంగారు హనుమంతకు టికెట్ ఇచ్చారని, అయితే అసంతృప్తితో ఉన్న ఆయన, ఇతర పార్టీలు ఆహ్వానం పలికినా ఎక్కడికి పోకుండా బీజేపీలోనే కొనసాగారని, పార్టీ హైకమాండ్ గుర్తించి ఆయనకు రాష్ట్ర కార్యదర్శి పదవిని కల్పించి గౌరవిస్తున్నదన్నారు. ఇకపై బంగారు హనుమంతకు రెబల్స్ బెడద ఉండదని స్పష్టం చేశారు. హనుమంతు గెలుపుకు కె.ఎస్.దివాకర్ తన సర్వశక్తులు ఒడ్డి గెలిపించగలరన్న విశ్వాసం వ్యక్తం చేశారు. సండూరు ఉప ఎన్నిక కొరకు నలుగురు సభ్యులతో కూడిన బృందం ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారని మాజీ మంత్రి గోవిందకారజోళ, ఎమ్మెల్యే సునీల్‌కుమార్, రవికుమార్, తాను ఇన్‌చార్జిలుగా గత రెండు నెలల నుంచి ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్నట్లు, ఈసారి బీజేపీ గెలుపు ఖాయమన్నారు. గంగావతి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గాలి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బంగారు హనుమంతు చిన్ననాటి నుంచే బీజేపీ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్నారని, ఒకసారి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేశారని, పార్టీకి సేవలందించిన దృష్ట్యా బంగారు హనుమంతకు టికెట్ ఇవ్వడం జరిగిందని, తమ అనుచరుడిగా ఉన్న దివాకర్‌కు కొంత అసంతృప్తి ఉండడం సహజమేనని, అయితే తన మాట ఎప్పుడూ దాటలేదని, ఆయనతో పాటు ఆయనను నమ్ముకున్న కార్యకర్తలు, మద్దతుదారుల్ని తానెప్పుడూ అలక్ష్యం చేసేదిలేదని, బీజేపీ పార్టీ నేతలు దివాకర్‌కు కార్యదర్శి పదవి ఇవ్వడం అభినందనీయమని చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి దివాకర్‌కు సండూరు నుంచే అభ్యర్థిగా చేస్తామని హామీ ఇచ్చారు. సండూరు క్షేత్రంలో ఇప్పటికే బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతుపరంగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు, ప్రజల నుంచి భారీగా మద్దతు లభిస్తుండడం సంతోషంగా ఉన్నదని చెప్పారు. ఈ సందర్భంలో మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, జి.విరూపాక్షగౌడ, ఎర్రంగళి తిమ్మారెడ్డి, హెచ్.హనుమంతప్ప, జి.ఐనాథ్‌రెడ్డి, వెంకటేష్, గోనాళ్ మురహరగౌడ తదితరులు పాల్గొన్నారు.

## తుమకూరు జిల్లాలో వానలకు ఇంటిగోడలు కూలి యువతి మృతి

**గుబ్బి (తుమకూరుజిల్లా ),అక్టోబర్ 23,ప్రభాతవార్త ప్రతినిధి**

తుమకూరు జిల్లాలో కురుస్తున్న జోరువానలకు బుధవారం గుబ్బి తాలూకాలోసంభవించిన దుర్ఘటనలో ఒక యువతి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుబ్బితాలూకా జి.హొసహళ్లి గ్రామంలో సహన అనే యువతి స్నానం చేసేందుకు తన ఇంటి పెరటి భాగంలోని స్థలానికి వెళ్ళగా అదే సమయంలో ఇంటి గోడలు కూడి యువతిపైన పడిపోయాయి. శిధిలాల కింద చిక్కుకుని ప్రాణాలు విడిచిన యువతిని స్థానికులు బయటకు తీశారు. ఈమేరకు గుబ్బి పోలీసుస్టేషనులో కేసు నమోదు అయ్యింది.

